

# కథ

విమలారామం

# విముక్తి

కాత్యాయనికి చిన్నకూతురు సరోజ తీరేమిటో బొత్తిగా అర్థం కావటం లేదు. దాని పెళ్లయి ఏడాదవుతోంది. పెళ్లయిన వెంటనే వచ్చిన దీపావళికి రాలేదు. పదహారు రోజుల పండక్కయినా ఉండకుండా మొగుడితో ఢిల్లీకి వెళ్లిపోయింది. తర్వాత సంక్రాంతికి రండని మూడుత్తరాలు రాయించింది. నాల్గు సార్లు ఫోన్ చేయించింది. ఆ పండక్కి రాలేదు సరికదా ఉగాది పండక్కయినా రాలేదు. చూస్తుండగా మరో ఆరు నెలలు గడిచిపోయాయి. ఏడాది గిర్రున తిరిగింది. మరో దీపావళి వస్తోంది. ఈ మాటూ ఇంతేనా!

ప్రొద్దున్న గుడి దగ్గర పొరుగింటి నాగరత్నం కనిపించి "ఏవమ్మా! ఈ దీపావళికి మీ సరోజ అత్తారింటికి వెళ్లి ఏడాదవుతోంది. ఏ ఒక్క పండక్కీ మొగుడితో వచ్చింది కాదు. పోనీ, తనొక్కత్తీ అయినా రాలేదు. ఇదెక్కడి చోద్యమమ్మా! పుట్టింటికి రాకుండా ఉండే కూతురెక్కడేనా ఉంటుందా! మీ పెద్దమ్మాయిలిద్దరూ రావటం లేదూ? దీనికేమి?" అంది.

ఇంటికి రాగానే సుబ్బారావు దగ్గర తన బాధ వెళ్లబోసుకుంది కాత్యాయని.

ఎప్పుడో పదేళ్ల క్రితం పెళ్లయిన పెద్దకూతురు పార్వతి మొగుడ్ని, ఇద్దరు పిల్లల్ని తీసుకుని పెద్ద పండగలకి పుట్టింటికి వస్తూనే ఉంది. ఐదేళ్ల నాడు అత్తింటికి వెళ్లిన రెండో కూతురు జానకి మొగుడ్ని, కొడుకుని తీసుకుని పండగలకి పిలిచిందే తడవు రెండు రోజులు ముందుగానే వచ్చి కూర్చుంటుంది. ఏడాదిగా ఎవరూ రాకపోతే వేరే సంగతి. పెద్దకూతుళ్లిద్దరూ తమ తమ భర్తలతో, పిల్లలతో పండగలకి వచ్చి వెళ్లారు. మరి కడకొట్టుది ఒక్కసారయినా రాకపోతే తనకెలా ఉంటుంది! నలుగురూ నోళ్లు నొక్కుకోరా! ఏదో కారణం లేనిదే కొత్తల్లుడు అత్తారింటికి రాకుండా ఉంటాడా!

అసలు అల్లుడు శ్రీనివాస్ పెళ్లయిన వెంటనే ఢిల్లీకి ట్రాన్స్‌ఫర్ అయి వెళ్లటమేమిటి? తల్లిదండ్రులు గుంటూరులో ఉండగా దగ్గరున్న హైదరాబాద్ కావాలా, ఢిల్లీకి వెడతావా అని తమపై అధికారి అడిగితే అంత దూరం వెళ్లిపోవటమేమిటి?

"మనం కట్నకానుకలు బాగా ముట్టచెప్పలేదని అలిగాడేమో!"

"పిల్ల సలక్షణంగా ఉంది. తమకంతే చాలని ఏమీ వద్దని వాళ్లే అన్నారు కదా! ఇంక పిల్లాడికి మనమీద కోపమెందుకుంటుంది?" అన్నాడు సుబ్బారావు.

"మరి ఎన్నిసార్లు పిలిచినా ఏ పండక్కో రాదేమిటి? కనీసం మన పిల్లనయినా పంపదెందుకని? ఒకసారి వస్తే కదా వాళ్లేమనుకుంటున్నారో తెలియటానికి!"

"మనింటికి రాలేదని నువ్వింత ఇదవుతున్నావు కానీ అమ్మాయి అత్తారింటికి కూడా రాలేదు. దాని అత్తమామలే ఢిల్లీకి వెళ్లొచ్చారు. అల్లుడికి శలవు దొరకటం లేదని వియ్యంకుడుగారు చెపుతుంటే మనమేం చేయగలం?"

"అంటే, కొత్తల్లుడు అత్తారింటికి రాకుండా ఏళ్లిలా గడిచిపోవల్సిందేనా?"

"మీ అత్తయ్య చాలా బాధపడుతోందని ఈ దీపావళికి తప్పకుండా రండని అతనికో ఉత్తరం రాస్తానుండు"

"లాభం లేదండీ! ఇది వరకు ఎన్ని ఉత్తరాలు రాయలేదు! వచ్చారా?"

"పోనీ, అమ్మాయికి ఫోన్ చేస్తే?"

"అదెప్పుడూ సరిగ్గా ఫోన్లో మాట్లాడదు. నాకేం... నిక్షేపంలా ఉన్నానంటుంది! మరి అమ్మని, నాన్నని చూడ్డానికి రావాలని దానికెందుకనిపించటం లేదో నాకర్థం కావటం లేదు"

"మరి ఏం చేద్దామంటావు?"

"ఇంకా దీపావళి పదిహేను రోజులుంది. మనిద్దరం ఢిల్లీకి వెళ్లి స్వయంగా అల్లుడ్ని వెంటబెట్టుకుని వద్దాము. అప్పుడయినా అతని మనసు కరుగుతుందేమో!"

"నిజంగానే వెడదామంటావా?"

"కూతురు కొత్త సంసారం చూడ్డానికయినా వెళ్లి రావద్దుటండీ!"

"ఆ మాట నిజమే! ఇవాళ్లే టిక్కెట్లు బుక్ చేస్తానుండు"

* * *

ప్రొద్దున్నే కాలింగ్ బెల్లు మ్రోగేసరికి ఎవరయి ఉంటారు చెప్మా... అనుకుంటూ తలుపులు తీసి బయట నిలబడిన తల్లిదండ్రుల్ని చూసిన సరోజ ఆశ్చర్యానందాలలో మునిగిపోయింది.

"ఎవరు సరూ!" అంటూ ముఖం తుడుచుకుంటూ వచ్చిన శ్రీనివాస్ "వాట్ సర్ప్రయిజ్! ఏమిటిది మామయ్యగారూ! ఒక్క ఫోన్ చేస్తే స్టేషనుకి వచ్చి రిసీవ్ చేసుకునేవాడ్ని కదా!" అంటూ గబగబా సుబ్బారావు చేతిలోని సూటుకేసు నందుకొని లోపలికి తీసుకువచ్చాడు.

"ఏమో అల్లుడుగారూ! మీ పెళ్లయి ఏడాదవుతోంది. ఎన్నిసార్లు పిలిచినా ఒక్కసారి కూడా వచ్చారు కాదు. మా మీద మీకెందుకు కోపమొచ్చిందో తెలుసుకుందామని వచ్చాము" అన్నాడు సుబ్బారావు కొంచెం తేలిక పడిన మనసుతో.

"భలేవారే మామయ్యగారూ! పెళ్లికి వచ్చినప్పుడు లాంగ్‌లీవు తీసుకున్నాను. తర్వాత నాకు ప్రాజెక్టు వర్క్‌తో బొత్తిగా శలవు దొరకలేదు. అంతే కానీ, మీమీద నాకు కోపమేమిటి?"

ఒక్కసారిగా కాత్యాయనికి తన గుండెల మీదున్న బరువు దిగిపోయినట్టయింది. "మరి, మా అమ్మాయినయినా పంపారు కాదు అల్లుడుగారూ!" అంది.

"ఆ తప్పు నాది కాదత్తయ్యా! మీ అమ్మాయిని నేనేమీ కట్టి పడెయ్యలేదు. తాను పుట్టింటికి వెడతానని అనకపోతే నేనేం చేయను?"

"అల్లుడుగారెక్కడ అలిగారో... ఎలా ఎలా బ్రతిమాలుకోవాలో అని మీ అత్తయ్య రైలు ప్రయాణమంతా తెగ రిహార్సల్సు వేసుకుంటూ వచ్చింది. ఇక్కడేమో మీరు తెగ నవ్వేస్తున్నారు. మీ అత్తయ్యకి భూమ్మీద కాలు నిలవటం లేదు" అన్నాడు సుబ్బారావు నవ్వుతూ.


ఇంతలో కాఫీలు కలిపి తెచ్చిచ్చింది సరోజ.

"అంతా బాగానే ఉంది. కానీ మీరిద్దరూ అల్లుడుగారూ అని పిలవటం మాత్రం నాకు నచ్చలేదు. శుభ్రంగా అమ్మానాన్నలు పెట్టిన పేరుంది. ఊరికే శీను అని పిలిచినా పలుకుతాను. మనలో మన

మాట. మీ అమ్మాయి కూడా నన్నలాగే పిలుస్తుంది"

ఆ గదిలో నవ్వులు కాకరపువ్వొత్తుల్లా వెలిగాయి. సరోజ సిగ్గుల మొగ్గయింది.

అతని మాటలూ అవీ వింటుంటే కాత్యాయనికి నిజంగానే గాలిలో తేలిపోతున్నంత ఆనందంగా ఉంది. ఇలాంటి మంచి అల్లుడు తమ ఇంటికి ఒక్కసారి కూడా రాకపోవటమేమిటి? తామెంత దురదృష్టవంతులం!



"ఈమాటు ఏమయినా మిమ్మల్ని దీపావళి పండక్కి తీసుకువెడదామని వచ్చాము బాబూ! మాతోపాటు మీక్కూడా టిక్కెట్లు బుక్ చేశారు మీ మామయ్య. మీరు శలవే పెడతారో మీ ఆఫీసు పని మా ఇంటికే తెచ్చుకుంటారో నాకు తెలియదు" అంది.

"అత్తయ్యా! వెరైటీగా ఉంటుంది. ఎలాగా మీరిక్కడికి వచ్చారు కనుక ఈ దీపావళిని మా ఇంట్లోనే జరుపుకుందాం"

"అయ్యో! అల్లుడ్ని పండక్కి పిలవటం పోయి అల్లుడింటికి అత్త పండక్కి వచ్చిందంటే అంతా నవ్విపోరా!" అంది బుగ్గలు నొక్కుకుంటూ.

"అక్కడే ఉంది ఈ అల్లుడి స్పెషాలిటీ! నేనే శలవు పెట్టి మీ ఇంటికి వచ్చానుకోండి. మహా అయితే, మూడు రోజులుంటానా. మీరు మూడు స్వీట్లు మాత్రమే చేసిపెడతారు. అదే, మా ఇంట్లో అయితే... ఇంకా పండగ పది రోజులుంటుంది కనుక పండక్కి ముందే మీ చేత పది రకాల స్వీట్లు చేయించుకుని తింటాను" అన్నాడు శ్రీనివాస్ నవ్వుతూ.

"నువ్వేనా చెప్పవే అమ్మా అల్లుడికి. అక్కడ అక్కల్ని, బావల్ని కూడా పండక్కి రమ్మని ఉత్తరాలు రాసి మరీ వచ్చాం. మేమిక్కడే ఉండిపోతే అక్కడ నలుగురూ ఏమనుకుంటారు?"

"నేను స్నానం చేసొస్తాను. అందాకా మీరు మాట్లాడుకుంటూ ఉండండి" అని శ్రీనివాస్ వెళ్లిపోయాడు.

"అమ్మా! ఇలా ఇంకెంత కాలం అక్కలూ, బావలూ పండగలకి వచ్చిపోతుంటారు? ఇలా ఎన్ని ఏళ్లు నాన్న పెన్షను డబ్బులతో అందర్కీ పండగలకి బట్టలు కొంటుంటారు? ఇంకా ఎన్ని సంవత్సరాలు నువ్వు పండగలకి పదిమందికి పిండివంటలు చేస్తూ వంటింట్లో ప్రొద్దున్నించి సాయంత్రం దాకా మగ్గిపోతుంటావు? ఇంక మీరెవరూ మారరా?" అంది సరోజ ఆవేశంగా.

"అదేమిటే అమ్మా! కూతుళ్లని, అల్లుళ్లని పండగలకి పిలవటం సంప్రదాయం కాదా!"

"సంప్రదాయం పేరు చెప్పి ఇల్లు ఒళ్లు హూనం చేసుకుంటారా అమ్మా! దేనికయినా ఒక హద్దంటూ ఉంటుంది. పెద్దక్కకి పెళ్లయి పదేళ్లయింది. ఇంకా పండగలకి పుట్టింటికి రావటానికి దానికి సిగ్గేయదా? ఐదేళ్లయినా ఇంకా అక్క పండగలంటూ వస్తుందేమిటే అని చిన్నక్క సణిగేది. ఇప్పుడు తనేం చేస్తోంది? తన పెళ్లయి ఐదేళ్ల

యినా, పిల్లాడు పుట్టినా తనూ అక్క దారిలోనే నడుస్తోందిగా! పోనీ, వస్తే వచ్చారు. కాస్త వంటింట్లో నీకు సాయపడతారా అంటే లేదు. ఆ పడకలు వదలరు. అక్కడికే అన్నీ తెచ్చివ్వాలి. నిన్న మొన్నటి దాకా నేనవన్నీ చూశాను. సిగ్గూ ఎగ్గూ లేకుండా నాకా పనులన్నీ పురమాయించేవారు. ఏమయినా సరే, దీనికో అంతం చూడాలనుకున్నాను. నేనెప్పటికీ అక్కల్లా నిన్నూ, నాన్ననీ ఇబ్బంది పెట్టాలనుకోలేదు. అందుకనే నేనీ యేడాది ఏ పండక్కూ రాలేదు. రాకూడదనుకున్నాను. వెంట వెంటనే రాలేనంత దూరం వచ్చేసిందీ అందుకే! పెళ్లయిన కొత్తలో మీ అల్లుడు నన్ను ప్రేమగా ఒక్క మాటడిగారు. నా దగ్గర ఏ దాపరికమూ లేకుండా నీక్కావలసింది నన్నడుగు. నాకు కావల్సింది నిన్నడుగుతాను. మనం ఎల్లకాలం ఒకే మనసుతో బ్రతకాలి. మన అన్యోన్యతకి అంతా ఆశ్చర్యపోవాలి అన్నారు. నేనాయన్ని కోరింది ఇదే! అత్తవారింటికి వెళ్లాలన్న మీ కోరిక ఏదయినా మామూలప్పుడు నేను కాదనలేను కానీ పండగలకి పుట్టింటికి వెళ్లి మా అమ్మానాన్నల్ని ఇబ్బంది పెట్టటం నాకే మాత్రం ఇష్టం లేదండీ అన్నాను. నా ఆలోచనకి నన్నాయన అభినందించారు ఈమాటు పండక్కి మీ అమ్మా నాన్నలని ఇక్కడికే పిలుద్దామని ఆయన అంటుంటే ఏదో నన్ను సంతోషపెట్టాలని అలా అన్నారనుకున్నానే కానీ... ఆయనెంత చిత్తశుద్ధితో ఆ మాటన్నారో... నిజంగానే మీ అంతట మీరు రమ్మన్నట్టు వచ్చేశారు. నాకందుకనే ఆనందంకన్నా ఆశ్చర్యం ఎక్కువ కలిగింది. నవ్వుతాలకి నీ చేత పది స్వీట్లు చేయించుకోవాలని అన్నా...నువ్వు మాకేమీ చేసి పెట్టనక్కర్లేదమ్మా! నాకు వాటినెలా చెయ్యాలో నేర్పు. నా దగ్గర పది రోజులుండి మా ఇంట్లో పండక్కి అమ్మా నాన్నా వచ్చారన్న ఆనందమూ నాకు కలుగుతుంది. నాకు నాల్గు పిండివంటలు చేయటం నేర్చుకున్న తృప్తీ మిగులుతుంది"

"మరి అక్కలకి పండక్కి రమ్మని ఉత్తరాలు రాశాము కదా! మేమూ సమయానికి అక్కడుండకపోతే అపార్థం చేసుకోరూ?" అంది కాత్యాయని ఇబ్బందిగా ముఖం పెట్టి.

"మనుషులు మారాలమ్మా! వాళ్లంతట వాళ్లు మారనప్పుడు వాళ్లు మారేలా చేయాలి. సంప్రదాయమని మీరు పిలుస్తారు. పిలిచిందే తడవు వాళ్లు వస్తుంటారు. ఏదో ఒక నాటికి దీనికి ఫుల్‌స్టాపు పెట్టాలి. దానికిప్పుడే అంకురార్పణ చేద్దాం.. మీతో పాటు వాళ్లనీ పిలిచాము. కానీ, ఇంతలో సరోజకి ఒంట్లో బాగాలేదని అల్లుడు ఫోన్ చేస్తే అర్జెంటుగా వచ్చాము. కొన్నాళ్లిక్కడ ఉండక తప్పటం లేదు. పండగకి ఇంట్లో ఉండలేకపోతున్నందుకు బాధపడుతున్నాము అని నాన్నని ఉత్తరాలు రాసి ఇద్దరికీ పోస్టు చేయమను. అంతే ఆ పై సంగతి నాకొదిలెయ్యి. నేనే వాళ్లతో ఫోన్లో మాట్లాడతాను"

అప్పుడే స్నానం చేసి వచ్చిన శ్రీనివాస్ "శభాష్ సరూ!" అన్నాడు.

"అల్లుడిని ఒక్కసారయినా పండక్కి పిలవలేదని నేను బాధపడుతుంటే అమ్మాయికి ఒంట్లో బాగాలేదని అబద్ధమాడి అల్లుడింట్లో పది రోజులుండిపోవటం ఏం భావ్యంగా ఉంటుంది బాబూ!" అంది కాత్యాయని.

"మీరు పిలవకపోవటమేమిటి? ప్రతి పండక్కీ పిలుస్తూనే ఉన్నారు. మేమే రాలేదు. మీరు నాకంటే పెద్దవారు. మీకు చెప్పవల్సినవాడ్ని కాదు. మీరు సదుద్దేశంతోనే మీ పిల్లల్ని పండగలకి పిలవచ్చు. కానీ అమ్మా నాన్నలు ఎల్లకాలం అలాగే ఉండిపోరు. పెద్దవాళ్లయిపోతున్నారు. వాళ్లకీ కాస్త విశ్రాంతి కావాలి అని పిల్లలు గ్రహించకపోతే ఎలా? ఏదో విధంగా తెలియజెప్పాలి. సరూ ఎంత దూరం ఆలోచించి ఆ మాట అన్నదో అర్థం చేసుకోండి. ఇక మీరు పండక్కి మా ఇంట్లో ఉండటమంటారా! నాకు మా అమ్మానాన్నలు ఎంతో మీరూ అంతే! వాళ్లే వచ్చినంతగా ఆనందిస్తాను"

"నీదెంత గొప్ప మనసు బాబూ!"

"ఆ టిక్కెట్లిలా ఇవ్వండి మామయ్యా! మావి కేన్సిలు చేయించి మీవి పోస్ట్‌పోన్ చేయిస్తాను" అన్నాడు శ్రీనివాస్.

"మరొక్కసారి ఆలోచించు బాబూ! ఎలాగా వాళ్లని పిలిచాము కనుక ఈ ఒక్కసారికే మీరూ పండక్కి వస్తే మాకు తృప్తిగా ఉంటుంది" అని సుబ్బారావు ఏదో చెప్పబోయాడు.

"లేదు నాన్నా! అల్లుళ్లకి మర్యాదలు చేసినందుకు ఇరుగుపొరుగు వారితో నీకు మర్యాదలు, గౌరవాలు పెరగచ్చు కానీ... పండగ పేరు చెప్పి అమ్మకి ఎంత చాకిరీ మీద పడుతుందో నువ్వాలోచించటం లేదు. రేపు అక్కలు గదులు వదిలి రారు. వాళ్లకి అక్కడే మర్యాదలు జరగాలి. ఇన్నాళ్లూ అమ్మ వండినవి చేరవేయటానికి నేనున్నాను. నేనూ ఆయనతో వస్తే ఏం చేయాలి? ఆయన్ని వదిలేసి అక్కబావలకి సేవలు చేయనా? లేక నేనూ నా గదిలో కూర్చుని అమ్మ మీద మరింత భారం వెయ్యనా? మన అదృష్టం కొద్దీ నన్నర్థం చేసుకునే భర్త నాకు దొరికారు. ఆయన మాటని గౌరవించండి. అమ్మకి విముక్తి కలిగించండి!"

కాత్యాయని చిత్తరువే అయింది.

చిన్నకూతురి మీద గర్వంతో సుబ్బారావు గుండెలు ఉప్పొంగి అతని కళ్లల్లోకి నీళ్లు చిప్పిల్లాయి. అప్రయత్నంగా తన జేబులోని టిక్కెట్లని అల్లుడి చేతికందించాడు.

